క్లుప్తంగా

ఘనంగా శ్రీరాముడి పట్టాభిషేకం



శ్రీరాముడి పట్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా పాతబజార్‌లోని శ్రీ భద్రాద్రి రామసాయి ఆలయంలో శనివారం శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సుగంధ ద్రవ్యాలు, పళ్లరసాలతో పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వలవల సురేష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్సాహంగా అన్నసమారాధన



అన్నప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: శ్రీరామ నవమి మహోత్సవాలు ముగింపు సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఘనంగా అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొగల్తూరులోని పేటపల్లం రామాలయం వద్ద నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులతో పాటు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

రామావతారంలో వేములదీవి వెంకన్న



ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామ పరిధిలోని కాపులకొడపలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని రామావతారంలో అలంకరించారు. శనివారం వేంకటేశ్వరునికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామి వారి సేవలో పాల్గొన్నారు. శ్రీ రామ నవమిని పురస్కరించుకుని వేంకటేశ్వరుని శ్రీరామావతారంలో అలంకరించి ఉన్న స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఆలయ పూజారి పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మదన గోపాలస్వామి రథోత్సవం



ఆచంటలో మదనగోపాలస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ఆచంటలో శ్రీరుక్మిణీ శ్రీసత్యభామ సమేత శ్రీ మదన గోపాలస్వామి వారి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం స్వామి వార్లను పల్లకిలో దేవాలయం నుంచి రథం వరకూ తీసుకు వచ్చి రథం వద్ద కుంభం పోసి పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి , వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరు పెద్దిరాజు, పెనుమంట్ర ఎంపీపీ కేఎస్ నారాయణ రెడ్డి(వాసు), రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్, సర్పంచ్ కోట సరోజనీ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు ఉల్లం జ్యోతి, తప్పెట్ల విజయకుమారి, కర్రి అనురాధ పాల్గొన్నారు.

11 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు

యలమంచిలి: లో ఓల్టేజి అధికంగా ఉన్న మండలంలోని పలు గ్రామాలకు 11 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ మంజూరైనట్లు ఎలక్ట్రికల్ ఏఈ దున్న రాజీవ్ తెలిపారు. దొడ్డిపట్ల గ్రామానికి మూడు, అబ్బిరాజుపాలెం, ఇలపకుర్రు గ్రామాలకు రెండేసి, యలమంచిలి, మేడపాడు, గుంపర్రు, నేరేడుమిల్లి గ్రామాలకు ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్స్‌కు సంబంధించిన మొత్తం మెటీరియల్ ఆయా గ్రామాలలో దిగుమతి అయ్యిందన్నారు. త్వరలోనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్స్ బిగించి ఆయా ప్రాంతాలకు లో ఓల్టేజి సమస్య తొలగిస్తామని రాజీవ్ చెప్పారు.

నియోజకవర్గంలో 12 రహదారుల అభివృద్ధి

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి



కాళీపట్నంలో ఆసరా వారోత్సవ సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: నియోజకవర్గంలో 12 ప్రధాన రహదారుల అభివృద్ధి, నిర్మాణ పనులు రూ.137.20 కోట్లతో జరుగుతున్నాయని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. శనివారం ఆయన పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులతో రోడ్లు, పీహెచ్‌సీ భవనాల నిర్మాణాలు, అభివృద్ధి పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 రోడ్లకు సంబంధించి 5 రహదారుల పనులు పూర్తయ్యాయని చెప్పారు. 3 రోడ్లకు సంబంధించి టెండర్లు పూర్తయ్యాయని, మరో 4 పనులు టెండర్ల దశలో ఉన్నాయని వివరించారు. నిధులు అందుబాటులో ఉన్న దృష్ట్యా పెండింగ్ రోడ్ల పనులు వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే వారతిప్ప నుంచి వెంప గ్రామానికి, కొత్తపాలెం నుంచి వెంపగ్రామానికి, కేపీ పాలెం నుంచి గుబ్బలవారిపాలెంకు, రుస్తుంబాద నుంచి మంగళగుంటపాలెం, పీచుపాలెం నుంచి దర్బరేవు గ్రామానికి ఈ 5 రహదారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసేందుకు రూ.76 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. అధికారులు నిర్లక్ష్యం లేకుండా పనులు పూర్తి చేయాలని కోరారు.

పీహెచ్‌సీల అభివృద్ధిపై దృష్టి

నియోజకవర్గంలో పీహెచ్‌సీ భవనాల అభివృద్ధిపై దృష్టి పెట్టినట్టు ప్రసాదరాజు వివరించారు. మొగల్తూరు పీహెచ్‌సీ అభివృద్ధికి రూ.53 లక్షలు నిధులు మంజూరు కాగా పనులు పూర్తయ్యాయని చెప్పారు. అలాగే ఇప్పటి వరకూ నియోజకవర్గంలో 3 పీహెచ్‌సీలు ఉండేవని చెప్పారు. కొత్తగా తీరప్రాంతం కాళీపట్నంలో పీహెచ్‌సీ నిర్మాణానికి రూ.2.43 కోట్లు నిధులు మంజూరు కావడం, ఆ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయ్యాయని తెలిపారు. పనులు వెంటనే మొదలు పెట్టేలా ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో నరసాపురం ఆర్‌అండ్‌బీ డీఈ జీవీఎస్ కిరణ్, ఏఈ టి.నిక్కీక్రజ్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్ మహిళా పక్షపాతి

నరసాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి మహిళా పక్షపాతి అని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం కాళీపట్నం పడమరలో ఏర్పాటు చేసిన ఆసరా వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాళీపట్నం పడమర, తూర్పు, వారతిప్ప, కోమటితిప్ప, జగన్నాథపురం, పాతపాడు, కొత్తోట, ముత్యాలపల్లి గ్రామాలకు చెందిన 471 గ్రూపులకు సంబంధించి రూ.3.98 కోట్లు చెక్కును డ్వాక్రా మహిళలకు అందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అధికారం చేపట్టక ముందు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే రెండు విడతలు వైఎస్సార్ ఆసరా పథకాన్ని అందించారని దీంతో మూడవ విడత సంబంధించి 75 శాతం రుణమాఫీ అందించామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఆసరా, చేయూత, సున్నావడ్డీ పథకాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారత సాధించే దిశగా పోత్సహిస్తుందన్నారు. మండలంలో 1566 గ్రూపులకు గానూ రూ.17.12 కోట్ల రూపాయల ఆసరా నగదును మహిళల బ్యాంకు ఖాతాలో జమ చేశామన్నారు. ముందుగా ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కవురు సావిత్రి, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పాలా జ్యోతి, నాయకలు కర్రి ఏసుబాబు, నాయకులు దొంగ నాగముని, కవురు సుబ్రహ్మణ్యం, బందన పూర్ణ చంద్రరావు, కొల్లాబత్తుల రవికుమార్, అంద్రాజు చల్లారావు రేవు నారాయణమూర్తి, జక్కంశెట్టి ఏడుకొండలు, తణుకుల వెంకన్న, సురేష్, కవురు పెద్దిరాజు, రామాని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

18న ప్రైవేట్ స్కూల్స్ జిల్లా స్థాయి సమావేశం

పాలకొల్లు అర్బన్: ప్రైవేట్ స్కూల్స్ జిల్లా స్థాయి సమావేశం ఏప్రిల్ 18న నిర్వహించాలని పాలకొల్లు జోన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సమావేశంలో నిర్ణయించారు. సంఘ సమావేశం ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్ ఆవరణలో శనివారం సంఘ అధ్యక్షుడు మద్దాల వాసు అధ్యక్షతన నిర్వహించారు. 2023–24 విద్యా సంవత్సరానికి పాలకొల్లు జోన్‌కు నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్ పాపారావునాయుడు, రాష్ట్ర సంఘ కార్యవర్గ సభ్యుడు మద్దాల రాంప్రసాద్, పాలకొల్లు జోన్ కార్యదర్శి కేవీ కృష్ణవర్మ, కోశాధికారి గొర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వర స్వామి

పెనుమంట్ర: మార్టేరులో గ్రామంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు పురస్కరించుకుని శనివారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు తీర్థ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు వెలగల చిన్నబాబు ఆలయ మర్యాదలతో శ్రీరంగనాథరాజును సత్కరించారు. ఆయన వెంట ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, సర్పంచ్ మట్ట కుమారి, ఎంపీటీసీ సభ్యులు కర్రి అనురాధ , గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి, పెనుగొండ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. కల్యాణోత్సవాల సందర్భంగా శనివారం మధ్యాహ్నం స్వామి వారిని ప్రత్యేక రథంపై నుంచి కోలాట నృత్య ప్రదర్శనతో గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే ఆలయ పక్కనే ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ లో అన్న సమారాధన నిర్వహించారు. వేసవి ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకుని పెనుమంట్ర మండల మానవత సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం నిర్వహించారు.

యువకుడి మృతిపై విచారణకు విజయవాడకు పోలీసులు

ఉండి: భీమవరానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి అభిరామ్ ఇటీవల మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా విజయవాడకు ప్రత్యేక బృందాన్ని పంపించినట్లు పోలీసులు తెలిపారు. పరీక్షలు ముగించుకుని మార్చి 28న విజయవాడ నుంచి రైల్లో వస్తున్న విద్యార్థి అభిరామ్ కలసిపూడి పంట కాలువలో శవమై తేలడంతో తన కుమారుడి మృతి అనుమానాస్పదంగా ఉందంటూ అతడి తండ్రి ఫిర్యాదు చేశారు. విజయవాడలో రైలు ఎక్కక ముందు ఏం జరిగిందనే విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడిపందేలపై దాడి

పాలకోడేరు: కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. గరగపర్రు శివారులో శనివారం కోడిపందేలు నిర్వహిస్తుండగా ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిందితులపై కేసు నమోదు చేశారు. వీరి వద్ద నుంచి రూ.2,100 నగదు, కోడి, ఒక కత్తి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

ఇళ్ల స్థలాల పంపిణీ నిరంతర ప్రక్రియ



తూర్పుపాలెంలో మినిమించిలిపాడుకు చెందిన ఇళ్ల పట్టాల లబ్ధిదారులతో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



వైఎస్సార్ సీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్రంలో ఇళ్ల స్థలాలు పంపిణీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం తూర్పుపాలెంలో పోడూరు మండలం మినిమించిలి పాడుకు చెందిన 13 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా ఒకేసారి 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అదేవిధంగా నిరంతరం దరఖాస్తు చేసుకొన్న అర్హులకు 90 రోజుల్లో ఇళ్ల స్థలాలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, సర్పంచ్ రామన వీర్రాజు, ఉప సర్పంచ్ పాతగొలుసు రాముడు, మండల మాజీ కన్వీనరు రుద్రరాజు శివాజీరాజు, పిల్లి నాగన్న, నలిమిల్లి బాబిరెడ్డి, బాలం సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు

పెనుగొండ: ప్రజలకు అండగా ఉండేది ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రమేనని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం తూర్పుపాలెంలో పెనుగొండ జవ్వాది వారి వీధికి చెందిన నల్లం తాతారావు, నల్లం పోతురాజు, నల్లం కనకారావు, నల్లం ప్రసాద్, నల్లం లక్ష్మీనారాయణలతో పాటు పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అన్ని వర్గాలకు సమన్యాయం సీఎం జగన్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు నల్లిమిల్లివేణుప్రతాపరెడ్డి(బాబిరెడ్డి), పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్‌కుమార్, బాలం పెద్దిరాజు, ఆసునగరి, నేలపూడి లక్ష్మణరావు, పోడూరి అప్పాజీ, త్సవటపల్లి బుజ్జి, సుంకర నాగబాబులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



గుడ్లు, బియ్యం ఇతర వంట సామగ్రిని పరిశీలిస్తున్న ఎండిఎం కోఆర్డినేటర్ కృష్ణారావు

పాలకొల్లు సెంట్రల్: ప్రతీ విద్యార్థికి పోషకాలతో కూడిన ఆహారాన్ని అందివ్వాలనే సంకల్పంతో ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో మంచి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తుందని మధ్యాహ్న భోజన పథకం జిల్లా కోఆర్డినేటర్ కె.కృష్ణారావు తెలిపారు. శనివారం పాలకొల్లులో బివిఆర్ఎం గరల్స్ హైస్కూల్, సింగోడియస్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ రెండు పాఠశాలల్లో భోజన పథకం బాగుందన్నారు. విద్యార్థులకు అన్ని సక్రమంగా అందుతున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1382 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతుందన్నారు. ఈ పాఠశాలల్లో 1,16,768 మంది విద్యార్థులు ఉన్నారని వీరిలో ప్రతీరోజు దాదాపుగా 96 వేల మంది పాఠశాలలకు హాజరైనా 75 నుండి 80 వేల మంది విద్యార్థులు పాఠశాలల్లోనే భోజనం చేస్తున్నారన్నారు. రోజుకు 85 వేల గుడ్లు సరఫరా చేస్తున్నామన్నారు. అంటే కొందరు భోజనం చేయకపోయినా గుడ్డు తింటే ఇవ్వాలని అందువల్లే గుడ్లు అధికంగా ఇస్తున్నామన్నారు. చిక్కీలు 90 వేల మందికి అందజేస్తున్నామన్నారు. ఇటీవల నూతనంగా ప్రారంభించిన రాగి జావ వల్ల వారానికి మూడు రోజులు సోమ, బుధ, శుక్ర వారాల్లో చిక్కీలు, మంగళ, గురు, శనివారాల్లో రాగిజావ అలాగే వారానికి ఐదు రోజులు గుడ్డు అందిస్తున్నామన్నారు. గుడ్డు మాత్రం పది రోజుల్లోనే ఖర్చు చేయాలన్నారు. పది రోజులు దాటిన గుడ్డును విద్యార్థులకు వండి పెట్టకూడదన్నారు. పది రోజులు దాటిన తరువాత విద్యార్థులకు గుడ్డు పెడుతున్నారనే ఉద్దేశంతో పది రోజులకో సారి గుడ్డుపై వేసే ముద్ర రంగ మారుస్తున్నామన్నారు. మెనూలో విజిటబుల్ పలావ్, పులిహోర, కూరగాయల రైస్, ఆకు కూర, చక్రపొంగలి, కుర్మా, సాంబార్, బ్రౌన్‌రైస్ వంటివి ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వై. ప్రభాకరశాస్త్రి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రామన్నపాలెంలో తోటబడి



మామిడిసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖాధికారులు

నరసాపురం రూరల్: మామిడికాయలకు వచ్చే తెగుళ్ళపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మందులు పిచికారీ ద్వారా నివారించవచ్చని జిల్లా ఉద్యానవన శాఖాధికారి కె.దుర్గేష్ తెలిపారు. శనివారం రామన్నపాలెం పంచాయతీలో నిర్వహించిన తోట బడి కార్యక్రమంలో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. తేనే మంచు పురుగు, తేనే పురుగు, కాయతొలుచు పురుగు, కాయపగుళ్ల నివారణకు స్పైనోసార్డ్ 0.3 మిల్లీలీటర్లు లేదా డైఫెన్ ఓనజాల్ 0.5 మిల్లీలీటర్లు వేప నూనె 1500 బీపీఎంను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే తెగుళ్లను నివారించవచ్చన్నారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన వన శాఖాధికారులు కె.ప్రియదర్శిని, వి.రాజ్ గోపాల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన



కొడమంచిలిలో పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెనుగొండ: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి నిర్వహించనున్న దృష్ట్యా పరీక్ష ఏర్పాట్లు కొడమంచిలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులు శనివారం పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆచంట మండల తహసీల్దార్ రాజ్యలక్ష్మీ, ఎంపీడీఓ జగన్నాథరావు, సర్పంచ్ సుంకర సీతారామ్, వీఆర్వోలు మిరియాల శేషగిరిరావు, కలిదిండి నర్సింహరాజు, కార్యదర్శి హినాభాను, ప్రధానోపాధ్యాయుడు దొమ్మేటి రాంబాబులు పాల్గొన్నారు.

రాగిజావ పంపిణీ పరిశీలన

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పాఠశాల విద్యార్థులకు ప్రారంభించిన రాగిజావ పంపిణీని కొడమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులు పరిశీలించారు. రాగిజావ విశిష్టతను వివరించి విద్యార్థులు అందరూ తప్పనిసరిగా తాగే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ ఆర్వీ ఆనంద్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. విద్యార్థులకు మంచినీటి సౌకర్యం, టాయ్‌లెట్స్ సౌకర్యం, పరీక్ష రాసేందుకు వీలుగా డెస్క్‌లు, ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సోమవారం నుంచి 18 వరకూ జరిగే పదో తరగతి పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు ఏర్పాట్లు చేయాలని హెచ్ఎంలకు సూచించారు. ఆయన వెంట ఈవోఆర్డీ నవీన్ కిరణ్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



వేడంగి జెడ్పీహైస్కూల్లో వ్యాసరచన పోటీలో విజేతలను అభినందిస్తున్న దృశ్యం

పోడూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితాన్ని నేటి యువత, విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని డాక్టర్ కేఎస్‌పీఎన్ వర్మ పిలుపునిచ్చారు. వేడంగి జెడ్పీ హైస్కూల్లో శనివారం కొట్టి సూర్యనారాయణ, వెంకటనర్సమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్లూరి జీవితంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఏఎంసీ మాజీ చైర్మన్ ఉన్నమట్ల కబర్ది, డాక్టర్ వర్మ, ట్రస్ట్ చైర్మన్ కొట్టి భాస్కరరావు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఆయా విద్యార్థులను ప్రముఖులంతా అభినందించారు. కార్యక్రమంలో కొట్టి భానుప్రకాష్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎంవీ రాజశేఖర్



ఎంవీ రాజశేఖర్

పోడూరు: మండలంలోని గుమ్మలూరు శివారు కొత్తపేట ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, ఏపీ యూటీఎఫ్ మండలశాఖ మాజీ అధ్యక్షులు ఎంవీ రాజశేఖర్ ఏపీయూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. విజయవాడలో శనివారం జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి, ఏపీ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పీఎస్ విజయరామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.క్షేమమూర్తి, కె.నాగరాజు తదితరులు అభినందనలు తెలిపారు.

మాదిగ యువసేన డివిజన్ అధ్యక్షుడిగా శేఖర్‌బాబు



మాదిగ యువసేన డివిజన్ అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకుంటున్న శేఖర్‌బాబు

నరసాపురం: మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘర్షణ సమితి(ఎమ్మార్పీఎస్ఎస్) నరసాపురం డివిజన్ మాదిగ యువసేన అధ్యక్షుడిగా సీతారామపురం గ్రామానికి చెందిన తెన్నేటి శేఖర్‌బాబును నియమించారు. ఇటీవల భీమవరంలో జరిగిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ సంఘ పెద్దలు తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పని చేస్తానన్నారు.

పది పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



బీవీఆర్ఎం బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సంవత్సరం పొడవునా కష్టపడి చదువుకున్న విద్యార్థులు పరీక్షల్లో తమ ప్రతిభను చూపడానికి సిద్ధం అవుతున్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు శనివారంతో హాల్ టికెట్లు అందజేశారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు పరీక్షలకు కావాల్సిన ప్యాడ్‌లు, పెన్నులను అందజేసి పరీక్షలు ఎలా రాయాలి? ఏం చేయాలి? మరొకసారి విద్యార్థులకు వివరించి చెప్పారు. ఉదయం 9.30 గంటల నుంచిమధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రలోకి ఉదయం 8.45 గంటల నుంచి పంపుతారు. అయితే ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.

పాలకొల్లులో పరీక్షా కేంద్రాలు ఇవే

పాలకొల్లు పట్టణంలో చిన్న కూరగాయల మార్కెట్ వద్ద్ ఉన్న బీవీఆర్ఎం గరల్స్ హైస్కూల్, గీతా అన్నపూర్ణ థియేటర్ ఎదురుగా ఉన్న బిఆర్ఎంవి ఉన్నత పాఠశాల, యడ్లబజారు సెంటర్ శంభుని పార్కు వద్ద ఉన్న ఎంఎంకేఎస్ఎం హైస్కూల్ ఈ మూడు మునిసిపల్ హైస్కూల్స్, దొడ్డిపట్ల రోడ్డులో ఉన్న సెంటిమెరిస్ హైస్కూల్, బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఎస్ కన్వెన్షన్ హాల్ ఎదురుగా ఉన్న చైతన్య హైస్కూల్, బ్రాడీపేట బైపాస్ రోడ్డులో కుళాయి చెరువు గట్టు ఎదురుగా రోడ్డులో ఉన్న ఆదిత్య హైస్కూల్, బ్రాడీపేట వంతెన అటువైపు ఉన్న నాగరాజు పేటలో ఉన్న గురుకుల పాఠశాలతో కలిపి మొత్తం పట్టణంలో ఏడు సెంటర్లు ఏర్పాటు చేశారు. పాలకొల్లు మండలంలో మూడు సెంటర్లు లంకలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు రెండు సెంటర్లు, శివదేవుని చిక్కాల జెడ్పీ హైస్కూల్ ఒకటి, యలమంచిలి మండలంలో ఐదు సెంటర్లు దొడ్డిపట్ల, మట్లపాలెం, యలమంచిలి, కాజ, ఏనుగువానిలంక గ్రామాల్లో ఉన్న జెడ్పీ హైస్కూల్లో సెంటర్లు కేటాయించారు. తరగతి గదిని బట్టి ఒక్కో రూములో 16 నుంచి 30 మంది విద్యార్థులను కూర్చోబెట్టనున్నారు.

పరీక్షకు హాజరుకానున్న విద్యార్థులు ఇలా

పాలకొల్లు మండలంలో 441, పట్టణంలో 563, యలమంచిలి మండలంలో 605, పోడూరు మండలంలో 276 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 720 మంది వరకూ విద్యార్థులు హాజరు కానున్నారు.

ఉపాధి హామీ పథకంలో చెరువు తవ్వకం పనులు

పాలకొల్లు అర్బన్: పంచాయతీకి చెందిన పశువుల చెరువు తవ్వడం వల్ల ఉపాధి కూలీలకు పని లభించడంతో గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సర్పంచ్ భూపతిరాజు ఇందిరాదేవీ అన్నారు. పాలకొల్లు మండలం బల్లిపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని గరువులో ఉపాధి హామీ పథకంలో పశువుల చెరువు తవ్వకం పనులకు ఆమె శనివారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. 400 పని దినాల అంచాలతో ఈ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుచ్చకాయల శాంత, వైఎస్సార్ సీపీ నేత భూపతిరాజు వేణుగోపాలరాజు (గోపిరాజు) పాల్గొన్నారు.

జిన్నూరులో..

పోడూరు: ఉపాధిహామీ కూలీలందరికీ పనులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిన్నూరు గ్రామసర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి అన్నారు. జిన్నూరు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో నిర్వహిస్తున్న మంచినీటి చెరువు తవ్వకం పనులను శనివారం ఆమె పరిశీలించారు. అలాగే ప్రభుత్వం పంపిణీ చేసిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూలీలకు అందజేశారు. జమ్ము మృత్యుంజయరావు (బుజ్జి) పాల్గొన్నారు.